ప్రజాశక్తి

గురువారం 2 జనవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

అభివృద్ధి పనులు రద్దు!

- 25 శాతం కంటే తక్కువ జరిగినవి నిలిపివేత
- సచివాలయాల పరిధిలో సగం పనులు పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాయాల పరిధిలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులకు నిధులు లేవని అప్పట్లో వైసిపి ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై వత్తిడి తేవడంతో ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరు చేశారు. ప్రధానంగా తాగునీటి సమస్య, కాల్వలు, డ్రెయినేజి, వివిధ తరగతుల ప్రజలకు తక్షణం కావాల్సిన మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు, విద్యుత్‌కు సంబంధించి తక్షణం స్తంభాలు మార్చడం, కొత్త లైన్లు వేయడం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం అప్పట్లో సచివాలయాల పరిధిలో



అంతర్గత రహదారి పనులు ఫైల్

నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను సకాలంలో వినియోగించుకోవడంలో అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు సఫలీకృతం కాలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన పనుల్లో 25 శాతం కంటే తక్కువ జరిగిన పనులను నిలిపివేశారు. 25 శాతం దాటి పురోగతిలో ఉన్న వాటిని కొనసాగించేందుకు అవకాశం ఇచ్చారు.

జిల్లాలో 568 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయంకు రూ.20 లక్షల చొప్పున రూ.113.60 కోట్ల జిల్లాకు విడుదలయ్యాయి. అయితే జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, గుంటూరు నగరంతో పాటు 782 పనులకు 536 పనులు పూర్తయ్యాయి. ఇందుకు గాను రూ.37.43 కోట్ల మేరకు పనులు పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలోనే చెల్లింపులు జరిగాయి. ఇంకా దాదాపు రూ.76.53 కోట్ల వరకు నిధులకు పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్నా

2లో



రహదారిపై బైఠాయించిన పారిశుధ్య కార్మికులు



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

పండగపూట పొట్టగొట్టే మాట

- పనిలోకి రావొద్దంటూ అర్ధరాత్రి ఫోన్‌లో చెప్పిన మేస్త్రి
- ఏడాది తొలిరోజే చేబ్రోలులో పారిశుధ్య కార్మికుల ఆందోళన
- విధుల నుండి ఆపేసి కుటుంబాల్ని రోడ్డున పడేయొద్దని ఆవేదన
- రహదారిపై బైఠాయింపు - ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్‌కు వినతి
- సిఐటియు మద్దతు - తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - చేబ్రోలు

నూతనేడాది అందరూ సంతోషంగా గడుపుతుంటే గ్రామాన్ని శుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు మాత్రం ఆవేదనతో రోడ్డెక్కారు. తమను పని నుండి తొలగించి పొట్టకొట్టొద్దని డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రంథాలయం సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వీరికి ఇతర కార్మికులు కూడా మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఉన్న పళంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. మంగళవారం రాత్రి చేబ్రోలు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 12


2లో



కాల్వల్లో ఇరుక్కున్న కారు

ఆదమరిస్తే అంతే సంగతి..

ప్రజాశక్తి-గుంటూరు



రోడ్డుపైకి నిర్మించిన కాల్వ

స్థానిక బ్రాడీపేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన మురుగు కాల్వల నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం వాహనదారులను ఇక్కట్లకు గురి చేస్తోంది. 2/18లోని గోపాలకృష్ణ రైస్‌మిల్లు వద్ద నిర్మించిన కాల్వను రోడ్డుపైకి వచ్చే విధంగా నిర్మించటం వల్ల అక్కడ పెద్ద గోయి ఏర్పడినట్లు ఉంది. దీంతో వాహనాల టైర్లు కాల్వల్లో ఇరుక్కుంటున్నాయి. రెప్పవాల్చినా, ఎదురెదురుగా వాహనాలు వచ్చినా ప్రమాదం తప్పదు. ఇటీవల ఒక బైక్, కారు ఇరుక్కుపోయాయి. అష్టకష్టాలు పడి వాటిని బయటకు తీశారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు, మురుగు కాల్వలు ఏకమవడం ఈ ప్రాంతంలో పరిపాటి. అప్పటి వరకూ ఈ కాల్వలను అంతే వదిలేస్తే మరింత ప్రమాదమని, బయటకు వచ్చిన కాల్వకు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిఎం చంద్రబాబుకు జిల్లా ఉన్నతాధికారులు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు





నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబును జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలెక్టర్, జెసి, తెనాలి సబ్‌కలెక్టర్, జిఎంసి కమిషనర్ కలసి శుభాకాంక్షలు చెప్పారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో వర్సిటీ అధికారులు భేటీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు, ఇన్‌ఛార్జి రెక్టార్ కె.రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోయపాటి పూర్ణ చంద్రశేఖరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ అభివృద్ధి, వర్సిటీలో జరుగుతున్న విద్యా విషయక, పరిశోధన అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మధుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి ప్రతి ఒక్క విశ్వవిద్యాలయం తమ వంతు కృషి చేయాలన్నారు. అన్ని విశ్వవిద్యాలయాలను మెరుగైన స్థానంలో నిలిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఉన్నత విద్య అభ్యసించే వారి సంఖ్యను పెంచి వారికి ఉన్నత ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి తగు సలహాలు సూచనలు వచ్చే విధంగా వినూత్న ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు పొందేందుకు నిరంతరం అందరం శ్రమించాలని సూచించారు.



మేయర్ మనోహర్ నాయుడుకు కార్పొరేటర్లు, అధికారుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - గుంటూరు

నూతన సంవత్సరంలో నగర ప్రజలందరికీ అన్ని శుభాలే జరగాలని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మేయర్‌ను బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు, నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. 2024లో కొందరికి ఒడిదుడుకులు ఏర్పడినా 2025లో అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు.



యర్రబాలెంలో యూనియన్ బ్యాంక్ 68వ శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ), గుంటూరు రీజియన్ తన 68వ శాఖను మంగళగిరి మండలం యర్రబాలెంలో ప్రారంభించింది. ఈ శాఖను ప్రత్యేకంగా ప్రీమియం కస్టమర్ల బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి ప్రారంభించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఈ బ్రాంచ్ కస్టమర్‌లకు బ్యాంకింగ్ అనుభవాన్ని ఆనందదాయకంగా మారుస్తుందని చెపాపరు. రీజనల్ హెడ్ ఎస్.జవహర్ మాట్లాడుతూ యుబిఐ వినియోగదారులకు, యర్రబాలెం గ్రామస్తులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. బ్రాంచ్ అభివృద్ధిలో వారి ప్రోత్సాహకాన్ని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ కస్టమర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, అధికారులు, ప్రాంతీయ కార్యాలయం, సమీపంలోని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు రూ.30 కోట్ల వరకు పనులు చేపట్టలేదు. మిగతా రూ.46 కోట్లకు సంబంధించి చేపట్టిన పనుల్లో 25 శాతం పనుల పురోగతి కంటే తక్కువ ఉన్న 303 పనులు రద్దు నిలిపివేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఇటీవల ఆదేశాలు వచ్చాయి. మొత్తం 1085 పనులు చేపట్టేందుకు అప్పట్లో ప్రభుత్వం అనుమతి ఇవ్వగా కేవలం 782 పనులు చేపట్టారు. వీటిని సకాలంలో పూర్తి చేయలేకపోయారు. 50 శాతానికి పైగా పూర్తయి వివిధ దశల్లో ఉన్న పనులకు దాదాపు రూ.30 కోట్ల వరకు బకాయిలు రావాల్సిఉంది. ప్రధానంగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య సమన్వయ లోపం వల్ల క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. కొన్ని పట్టణ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు నామినేటెడ్ పద్ధతిలో తమ బినామీల ద్వారా పనులు చేపట్టేందుకు అవకాశం ఇవ్వగా కొన్నిచోట్ల అధికారులు నామినేటెడ్ కాకుండా టెండర్లు పిలవాలని నిర్ణయించడంతో పనులు చేపట్టడంలో జాప్యమైందని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఏడాదికి ముందే నిధులు విడుదల చేసినా సకాలంలో పనులు పూర్తిచేయడంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, అధికారులు శ్రద్ధ కనబర్చలేదు.

పండగపూట పొట్టగొట్టే మాట



కార్మికులతో మాట్లాడుతున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

(మొదటి పేజీ తరువాయి)

మంది గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ఒకటో తేదీ నుండి పనులకు వెళ్లొద్దంటూ మేస్త్రి ఫోన్ చేసి చెప్పాడని, అయినా తాము బుధవారం ఉదయాన్నే రోజుమాదిరిగానే పనిలోకి వచ్చామని, అయితే పంచాయతీ కార్యదర్శి చెప్పారంటూ తమను పనులు చేయకుండా మేస్త్రి అడ్డుకున్నారని తెలిపారు. 20 ఏళ్ళుగా పనిచేస్తున్న తమను అకారణంగా తమను పనుల నుండి తీసేస్తే తమ ఉపాధి ఏం కావాలని, తమ కుటుంబాలు రోడ్డున పడవా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి పని చేశామని, గుర్తు చేశారు.

కార్మికులకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముందు హెచ్చరికలేమీ లేకుండా అకస్మాత్తుగా ఉద్యోగులను పని నుండి ఆపడం చట్ట విరుద్ధమన్నారు. గ్రీన్ అంబాసిడర్స్‌ను తొలగించడానికి అవకాశం లేదని, టెండర్ కార్మికులను తొలగించాలంటే టెండర్ ముగిసే వరకు ఆగకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కనీస నిబంధన కూడా పాటించకుండా పంచాయతీ సెక్రెటరీ వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తొలగించడానికి కారణాలను తక్షణమే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకులు బాగుపడతాయి అనుకుంటే బతుకులు రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం 6 గంటల నుంచి ఆందోళన చేస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం కార్మికుల పట్ల వాళ్లకి ఉన్న ద్వేష భావానికి నిదర్శనమన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, టెండర్ పేరుతో వీరిపై రాజకీయ వేధింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. ఐదేళ్లుగా కార్మికులను బెదిరింపులకు గురి చేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ హనుమంతరావు, పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకురి రమేష్‌బాబు, నాయకులు ఆదిశేషు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు హరిబాబు, నారాయణ, ఏకసిరి శ్రీను, రాఘవమ్మ, బి.అన్నపూర్ణ, బి.కరుణమ్మ, నక్క శైలజ, దీపిక, బూసి సుబ్బమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు సిఐటియు మద్దతు

కార్మికులకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ వై.నేతాజీ ఒక ప్రకటన జారీ చేశారు. గత ఐదేళ్లగా వేతనాలు పెంచకపోవడంతోపాటు కరోనా సమయంలో పనిచేసిన వారినీ అర్థాంతరంగా తొలగించడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. బాధిత కార్మికులందరూ నిరసన తెలియజేస్తున్నా పంచాయతీ సెక్రెటరీ కనీస స్పందింకపోవడాన్ని తప్పుబట్టారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పేమీ చేయకుండానే..

పెరికల సుజాత, రాయపూడి సీత, పారిశుధ్య కార్మికులు, చేబ్రోలు





గతంలో ఏమైనా సమస్యలుంటే మీటింగ్ పెట్టి చెప్పేరు. వార్డు మెంబర్లు మీరు చేసే పనులను పరిశీలిస్తూ ఉంటారని, సమస్యలు రాకుండా విధులు నిర్వర్తించాలని చెప్పేవాళ్లు. కానీ ఇప్పుడు అలాంటి మీటింగ్ లేవు. మామూలుగా ఫోన్ చేసి మీరు ఆగిపొండి అంటున్నారు. దీనికి అర్థం ఏంటి? కొత్త వాళ్లని తీసుకోవడానికా? మేము ఏ తప్పూ చేయలేదు. మమ్మల్ని విధుల్లోకి తీసుకునే వరకూ తాముకూడా విధుల్లో పాల్గొనబో మంటూ ఇతర కార్మికులు కూడా మాకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

సమాజ హితం కోసం సమయాన్ని వెచ్చిద్దాం

నూతన సంవత్సర వేడుకల్లో అవగాహన సంస్థ సభ్యుల ప్రతిన

ప్రజాశక్తి - గుంటూరు



జీవితం చాలా చిన్నదని, ఎవరి జీవితం ఎప్పుడు సమాప్తం అవుతుందో ఎవరికీ తెలియదని విలువలతో గడపటానికి శాయశక్తులా ప్రయత్నిద్దామని, సమాజ హితం కోసం సమయాన్ని వెచ్చిద్దామని అవగాహన సంస్థ సభ్యులు నూతన సంవత్సర వేడుకల్లో ప్రతినబూనారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సంస్థ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టే ముందు మనం గతాన్ని నెమరు వేసుకొని జాగృతమయ్యే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. భవిష్యత్ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. గడిచిన కాలాన్ని మరింత దగ్గరగా, నిశితంగా పరిశీలించడం వల్ల ఇక ముందు ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఒక స్పష్టత వస్తుందని చెప్పారు. కాలాన్ని వినియోగం చేసుకోవడం పైనే సాఫల్య, వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. అవగాహన సంస్థ కార్యక్రమాలు మరింత స్ఫూర్తితో ముందుకు తీసుకు వెళదామన్నారు. అవగాహన సంస్థ అధ్యక్షులు పిఎస్ మూర్తి మాట్లాడుతూ గోడకు నూతన సంవత్సర క్యాలెండర్ వేలాడదీసే ముందు ఎన్నో విషయాలు, గణాంకాలు మారిపోయిన విషయం మనకు బోధ పడుతుందన్నారు. అవగాహన సంస్థ గత సంవత్సరం చాలా ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఆరోగ్య సభలో, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన సంస్థ సభ్యులు అందరూ ఆనందంగా.. ఆరోగ్యకరంగా.. సామాజిక స్పృహతో.. స్నేహభావంతో కొనసాగుతామని, అందరం కలిసి గుంటూరు అభివృద్ధి చేద్దామని ప్రతినబూనారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు కె.సాంబయ్య, అధ్యాపకులు సుబ్బారెడ్డి, ఇందుశేఖర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఆటో డ్రైవర్లకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి యూనియన్ ద్వారా ఐక్యంగా ఉద్యమించాలని పల్నాడు జిల్లా ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పెదనందిపాడు సెంటర్ ఆటో డ్రైవర్లు నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం స్థానిక కళా మందిర్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లును సత్కరించారు.

ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ సత్కారం

డిపో అభివృద్ధి మనందరి విజయమని, నూతన సంవత్సరంలో తన పూర్తి సహకారం కార్మికులు, ఉద్యోగులకు ఉంటుందని స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ రాంబాబు అన్నారు.



ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధర్యంలో నాయకులు డిఎంను బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యోహాను, ఫణీంద్రకుమార్, గౌరవాధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కరపత్రాల పంపిణీ



చినకాకానిలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీలో ఈమని అప్పారావు తదితరులు



మంగళగిరిలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీలో పి బాలకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలం లోని చిన్న కాకాని గ్రామంలో మనమంతా భారతీయులం ,హిందూ ముస్లిం క్రైస్తవులు ఎవరైనా భరతమాత ముద్దుబిడ్డలే , దేశ సమైక్యత మతసామరస్యం వెల్లివిరియాలి అని, స్వేచ్ఛ ,సమానత్వం ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందడుగు వేద్దామని 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామంలోని తిరుపతమ్మ తల్లి గుడి సెంటర్, పార్క్ సెంటర్ , బావానారుషిగుడి సెంటర్, రామాలయం గుడి సెంటర్ లలో కరపత్రాలు విరివిగా పంపిణీ చేయడం జరిగింది . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ గ్రామ ప్రజానీకానికి 2025 నూతన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబము సుఖసంతోషాలతో గడపాలని, ప్రజలందరూ మెరుగైన జీవితం గడపాలని సిపిఎం ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కట్టు, బొట్టు , ఆహారపు అలవాట్లు కుటుంబ సంబంధాలు, సాంప్రదాయాలు , సంస్కృతి , మతవిశ్వాసాలు వంటి విషయాల్లో మన దేశంలోనూ, మన రాష్ట్రంలో కూడా ఎంతో వైవిధ్యం ఉందని ఈ వైవిధ్యమే మన దేశానికి ఒక గొప్ప విశిష్టత తెచ్చిందని తెలిపారు. ఒకే దేశంలో ఇన్ని మతాలు పుట్టి పెరిగి విస్తరించిన వారసత్వం మరి ఎక్కడా కనిపించదని మన దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉందని తెలిపారు. ఇటువంటి మంచి సాంప్రదాయం గల దేశంలో మతకలహాలు సృష్టించేందుకు మతోన్మాదులు ప్రయత్నం చేస్తున్నారని అలాగే లౌకిక రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేందుకు ప్రయత్నం చేస్తున్నారని దీనిని అడ్డుకోవాలని తెలిపారు. మన రాజ్యాంగాన్ని ,మన దేశాన్ని, లౌకికత్వాన్ని మనం అందరం కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండలం నాయకులు వట్రం పూర్ణయ్య ,చిన్నకాకాని గ్రామ నాయకులు కాజ శంకర్రావు, టి .బ్రహ్మయ్య ,టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆత్మకూరులో కరపత్రాల పంపిణీలో ఉద్దంటి దుర్గారావు, పకీరయ్య తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

భిన్న మతాల సాంప్రదాయాలు ఆచారాలు కలిగినటువంటి మన భారతదేశం ఎంతో వైవిధ్యమైన విశిష్టత కలిగి ఉంది భిన్నత్వంలో ఏకత్వంల జీవిస్తున్న ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకుంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు సీనియర్ నాయకులు మొసలి పకీరయ్య మండల కమిటీ సభ్యుడు గడ్డం అజయ్ కుమార్ కాంద్రు ఆంజనేయులు చింతలచెరువు జాను జనార్ధనరావు సుబ్రహ్మణ్యం శర్మ రామారావు గిరి బాబ్జి సీతారామాంజనేయులు సురేష్ మునగాల శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిపిఎం పాత మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం ప్రజల నడుము నెలకొని ఉన్నప్పుడే సుస్థిరత ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గాన పురోగమన వైపుగా దేశాన్ని నడిపించే బదులు, ఆ విలువలకు తూట్లు పొడుస్తూ దేశాన్ని తిరోగమన దశలో నడిపించే ప్రయత్నాలు ముంమ్మరం అవుతున్నాయని విమర్శించారు. బిజెపి నేతత్వలో కేంద్ర ప్రభుత్వం వాటి ఆధీనంలో ఉండే వివిధ వ్యవస్థలు వారిని వెనుక నుండి నడిపిస్తున్న సంఘపరివార్ గురించి వివరించారు. మతాన్ని రాజకీయాల్లోకి తీసుకు రాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం చలపతిరావు, ఎం రాంబాబు, ఎస్ కోటేశ్వరరావు, రాజారావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీలో జెట్టి బాలరాజు తదితరులు

ప్రజాశక్తి -దుగ్గిరాల

మతోన్మాద శక్తుల నుండి భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ బీజేపీ యొక్క విధానాలను వివరించారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చాక నిత్యవసర సరుకులు ధరలు గ్యాస్ పెట్రోలు ధరలను విపరీతంగా పెంచిందని అన్నారు. బిజెపి విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని, కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ ఎం దుర్గా ఎం అంజయ్య కే బిక్షాలు శశిరేఖ, శ్యామల బి.చిరంజీవి ఎం కోటేశ్వరావు ఎం పార్వతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి, గుండాలపాడు, మునగపాడు, పొనుగుపాడు, తక్కెళ్ళపాడు, 113 తాళ్లూరు, తదితర 9 గ్రామాలలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కరపత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మనమంతా భారతీయులం, హిందూ ముస్లిం క్రైస్తవులు ఎవరైనా భరతమాత బిడ్డలే దేశ సమైక్యత మతసామరస్యం వెల్లువిరియాలి, స్వేచ్ఛ సమానత్వం ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందడుగు వేయాలి. అనే నినాదంతో కరపత్రాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిరంగిపురం మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మార్పుల వెంగళరెడ్డి, జి బాలకృష్ణ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో



వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 2025 నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వర్సిటీ ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు వర్సిటీలోని అధ్యాపకులకు, అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వీసీ గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందాలని వారి అభివృద్ధి తో పాటు విశ్వవిద్యాలయం అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థి సేవలకు విశ్వవిద్యాలయం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, బోధన పరిశోధన రంగాలను బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరం కృషి చేయాలని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రర్ సింహాచలం మాట్లాడుతూ వర్సిటీలో ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా మెలగాలని, సోదర భావంతో ఉండాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ఆర్కిటెక్చర్ కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, వర్సిటీ అధికారులు, వికాస కార్యవర్గం, దినసరి ఉద్యోగుల సంఘం ఈ సందర్భంగా వర్సిటీ అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న కార్మికులు

ఆటో, రిక్షా యూనియన్ నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల కేంద్రమైన పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్ లోని రిక్షా స్టాండ్ వద్ద ఆటో, రిక్షా కార్మికులు బుధవారం నూతన సంవత్సర వేడుకలు కేక్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ నూతన సంవత్సరం ఆటో, రిక్షా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆటో కార్మికుల సంఘం అధ్యక్షులు కట్టా రవి వర్మ అన్నారు . ఈ కార్యక్రమంలో పలువురు ఆటో, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

పేరేచర్లలో 120 బస్తాల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల లో బుధవారం రాత్రి రేషన్ బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మేడికొండూరు పోలీసులు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పేరేచర్ల సమీపంలోని దేవసేన రైస్ మిల్ సమీపంలో మేడికొండూరు ఎస్సై షేక్ ఖాజీ బాబు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 120 బస్తాల రేషన్ బియ్యంతో మహేంద్ర మినీ లారీలో దేవసేన రైస్ మిల్‌కు వచ్చిన డ్రైవర్ పోలీసులను చూసి లారీని వదిలి పరారయ్యాడు. అనుమానంతో లారీను తనిఖీ చేసిన మేడి కొండూరు ఎస్సై ఖాజిబాబు లారీలో రేషన్ బియ్యం గుర్తించి 120 బస్తాల రేషన్ రైస్ తో పాటు లారీని సీజ్ చేసి మేడికొండూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనిపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాదెండ్ల మనోహర్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా కలెక్టర్

గుంటూరు, విజయవాడకు దీటుగా తెనాలి : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం తెనాలి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జనసేన క్యాంప్ కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ ను కలవడానికి ప్రజలు, అధికారులు బారులు తీరారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పి సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ వి సంజన సింహ, ట్రైనింగ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, తెనాలి తహశీల్దార్ కెవి గోపాలకష్ణ, అగ్రికల్చర్ ఎడి ఎన్ ఉషారాణి, రోడ్డు రవాణా సంస్థ అధికారులు ప్రసాద్, రాఘవరావు, పౌర సరఫరా శాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులు, పలు శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 లో ఇచ్చిన హామీలను 2025 నూతన సంవత్సరంలో కచ్చితంగా అమలుచేస్తామని అన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రజలకు అండగా ఉంటామన్నారు. గుంటూరు, విజయవాడ నగరాలకు దీటుగా తెనాలి ప్రాంతాన్ని అభివద్ధి పరుస్తామని తెలిపారు. ప్రజలు, రైతులు పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో తూలనూగాలని ఆకాంక్షించారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీడిత పక్షాల గొంతు వినిపించే పత్రిక ప్రజాశక్తి అన్నారు. రైతు, రైతుకూలీ, కార్మికుల హక్కుల కోసం పెత్తందారి, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజాశక్తి పోరాడుతుందని, అటువంటి పత్రిక క్యాలెండర్ ముద్రించటం సంతోషదాయకమని అన్నారు. పత్రికా యాజమాన్యానికి, విలేకర్లు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చినవెంకట్రామిరెడ్డి, కొమెరా దుర్గారావు, అన్వర్‌బాషా, విలేకర్లు ఉప్పుతోళ్ళ రమేష్, ఉప్పు ప్రసాద్, పావులూరి సతీష్‌బాబు, ఉప్పుతోళ్ళ రాజు, దత్తు పాల్గొన్నారు.



సిఎం హామీ.. కలెక్టర్ అమలు..

ఉల్లంగుల ఏడుకొండలుకు ఎయిర్ కంప్రెషర్ అందజేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం యల్లమందలోని ఉల్లంగుల ఏడుకొండలు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని, వ్యాపారం చేసుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెంటనే అమలు చేశారు. బుధవారం ఏడుకొండలు ఇంటికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సందర్శించి ఎయిర్ కంప్రెషర్‌ను అందజేశారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం సిఎం చంద్రబాబు మంగళవారం వచ్చిన సందర్భంగా ఉల్లంగుల ఏడుకొండలుకు ఇంటివద్దే పింఛను అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు స్వయంగా కాఫీ తయారు చేసి అందజేశారు. ఆ సందర్భంగా ఆయన ఏడుకొండలు కుటుంబ పరిస్థితులపై ఆరా తీసి ఆదుకుంటామని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల చెక్కును ప్రజా వేదిక వద్దే సిఎం అప్పటికప్పుడే అందజేశారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీఓ కె.మధులత, తహశీల్దార్ కొనికినేని వేణుగోపాలరావు పాల్గొన్నారు.





ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక పుతుంబాక భవన్ ఆవరణలో కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు కుండ కొట్టుడు ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మునగా జ్యోతి, గద్దె ఉమశ్రీ, ఉపాధ్యక్షులు డి.విమల, టి.లక్ష్మి, కె.రమాదేవి, ఎ.కుమారి, అనువాయమ్మ, ఎం.రమాదేవి, కొల్లా ప్రియాంక, ఇంజం అరుణ, కొల్లా బిందు, సావిత్రి, సంధ్య, ప్రజాసంఘాల నాయకులు అనుముల వీరబ్రహ్మం, కె.శివదుర్గారావు, పొట్టి సూర్యప్రకాశరావు, పెండ్యాల మహేష్, కె.స్వామి, జడ రాజకుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు ఆటో యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి షేక్ కరీముల్లా మాట్లాడుతూ యూనియన్ తరపున వినుకొండలోని ఆటో డ్రైవర్ మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా యూనియన్ తోడుగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు వినుకొండ గౌరవాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.హనుమంత్‌రెడ్డి, ఆటో డ్రైవర్లు రవితేజ, గురుమూర్తి, ఏడుకొండలు, గోపి, ఖాదర్‌బాషా, కోటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

నూతన సంవత్సరం సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలను మండలంలోని నార్నెపాడులో పంపిణీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రతలను మతసామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధానంగా దేశంలో వివిధ భాషలు సంస్కృతులు కలిసి సహజీవనం చేస్తున్న రాష్ట్రాల సమైక్యతను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తొండపి మస్తాన్‌రావు, దాసరి అప్పారావు, కూరపాటి ప్రభాకర్‌రావు, ఇంజం సాంబశివరావు, మలినీడి నాగేశ్వరరావు, ఇందూరి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

క్షురకుల ఆదాయాలకు కత్తెర!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యువత అభిరుచులు, ఆకాంక్షలకు తగ్గట్టుగా వృత్తిలో నైపుణ్యాలను పెంచుకోవడం.. కార్పొరేట్ పోటీని తట్టుకోవడానికి అధునాతనంగా షాపులను రూపురేఖలను మార్చుకోవడం.. కొత్త కొత్త పరికరాల కొనుగోలు.. వృత్తి నిర్వహణకు అవసరమయ్యే వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం, విద్యుత్ బిల్లుల మోత.. అద్దెల భారం.. వెరసి క్షౌరవృత్తిదార్లకు ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఒక్కో వినియోగదారుని నుండి రూ.100 నుండి రూ.250 వరకూ వసూలు చేస్తున్నా ఖర్చులన్నీ పోను తమకు మిగిలేది స్వల్పంగానే ఉంటోందని, ఆదాయంలో భారీగా కత్తెర పడుతోందని క్షురకులు ఆవేదనకు గురవుతున్నారు.


పెట్టుబడిదారులతో పోటీ పడే లేక, పెరుగుతున్న అద్దెలు, కరెంటు బిల్లులు, ఇతర వస్తువుల ధరలు, పన్నులతో క్షౌరవృత్తిదారులు షాపుల నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారు. నిలువు కాళ్లపై ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉండి పని చేసినా రోజుకు రూ.1000-1200 మాత్రమే వస్తున్నాయి. ఇందులోనే షాపులు అద్దెలు, విద్యుత్ బిల్లులు, వృత్తికి వాడే వస్తువుల ఖర్చులు, ఇతర ఖర్చులు కింద రూ.600-700 వరకు పోతున్నాయి. మిగిలిన డబ్బుతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని వృత్తిదార్లు వాపోతున్నారు. దీనికితోడు త్రీడీలు, నూతన డ్రమ్స్ అంటు అటు సన్నాయి వాయిద్యాలను, మేళాలనే కాకుండా రెండు మూడు ఏసీలతో రూ.లక్షలు వెచ్చించి కొత్త డెకరేషన్లతో సెల్‌ఫోన్, కంప్యూటర్లు చుస్తూ రకరకాల మోడళ్లలో క్రాపులు, గడ్డాలు బాడి మసాజులంటూ క్షౌరవత్తికీ సంబంధం లేని పెట్టుబడిదార్లు ఈ వృత్తి లోకి రావటంతో వారి పోటిని సాధారణ క్షౌరవృత్తిదార్లు తట్టుకోలేక ఇతర ఉపాధి మార్గాలు వెదుక్కోవాల్సి వస్తోంది. కళ్యాణ మండపాలు, కొత్త కొత్త డ్రమ్స్, ఇతర విధానాలతో పెళ్లిలకు సన్నాయి వాయిద్యాలు వాయించే వారికి ప్రాముఖ్యత తగ్గి ఉపాధి మరింతగా తగ్గింది. అటు పోటీకి నిలబడలేక, మరోవైపు పెరుగుతున్న వృత్తి నిర్వహణ ఖర్చులు, నిత్యాసర ధరలతో జీవనం కష్టంగా గడుస్తోంది. పండగలు, పిల్లల చదువులు, హాస్పిటల్ అవసరాలకు అప్పులే గతవుతున్నాయి.





చిలకలూరిపేట పట్టణంలో 170 వరకు చిన్నా పెద్ద బార్బర్ షాపులు ఉన్నాయి. ఇటీవల కాలంలో కార్పొరేట్ స్థాయిలో నిర్వహించే షాపులు 20 వరకూ వెలిశాయి. క్రాఫ్ చేయించుకునే వారు కూర్చోవడానికి చెక్క కుర్చీ అయితే రూ.10-13 వేలు పెట్టి కొంటున్నారు. స్పాంజి/ఫోమ్ కుర్చీ అయితే రూ.25 వేలు ఉంటోంది. ఏసీలు పెట్టాలంటే రూ.70 వేల నుండి రూ.లక్ష వరకు అవుతుంది. షాపునకు అద్దాలు పెట్టాలంటే అదికూడా రూ.లక్షల్లోనే ఉంటోంది. పూర్తి సెట్టింగులతో, రెండు-మూడు ఏసీలతో పూర్తి ఇంటిరియల్ డెకరేషన్లతో వింత వింత కాంతులతో బల్బులు పెట్టి ఫైవ్‌స్టార్ హోటల్ మాదిరిగా ఈ షాపులకు పెట్టుబడి పెట్టి నిర్వహిస్తున్నారు. కేవలం అద్దెలు, అడ్వాన్సులు కాకుండా ఏసీ షాపు నిర్మాణానికే రూ.20-30 లక్షలు అవుతాయంటున్నారు. వీటి పోటీని తట్టుకుని మార్కెట్‌లో నిలబడ్డానికి సాధారణ వృత్తిదార్లు పాత షాపులకు కొద్దిపాటి మార్పులు చేస్తేనే రూ.5 లక్షలకుపైగా అవుతోంది. ఈ మొత్తాన్ని సమకూర్చుకోవాలంటే అప్పులు చేయాల్సి రావడం, ఇది తలకు మించిన భారంగా మారడం, వడ్డీలు చెల్లించడానికీ అవస్థలు పడడం వంటి ఇబ్బందులను వృత్తిదార్లు ఎదుర్కొంటున్నారు.

గతంలో క్రాఫ్ చేసేటప్పుడు ఉపయోగించే దువ్వెన ధర రూ.5 ఉంటే ఇప్పుడు రూ.25కు పెరిగింది. కొబ్బరి నూనె, డెటాల్ ధర రెట్టింపైంది. గడ్డం చేసేందుకు వాడే క్రీమ్ రూ.25-40 నుండి రూ.150కు పెరిగింది. బ్లేడు కట్ట రూ.10-20 నుంచి రూ.70 అయ్యింది. బ్లేడు పెట్టి గడ్డం చేసే కత్తి రూ.100 నుంచి రూ.300కు పెరిగింది. తల, పేస్ మాస్కులు ధరలు కూడా రెండు మూడు రెట్లు పెరిగాయి. ట్రిమ్మర్లదీ అదే పరిస్థితి. గతంలో యూనియన్ తరపున వస్తువులు తక్కువ ధరలకు ఇచ్చినా ఇప్పుడు అదికూడా నిలిపేశారు. ఈ నేపథ్యంలో షాపుల ఏర్పాటుతోపాటు నిర్వహణ, వృత్తి కొనసాగింపు తీవ్ర ఆర్థిక భారంగా మారడం, మిగిలే డబ్బులతో కుటుంబాలు గడవడం కానా కష్టమవుతోందని క్షౌరవృత్తిదార్లు వాపోతున్నారు. తమ వృత్తి నిర్వహణకు అవసరమైన వస్తువులను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయాలని, వడ్డీలేని రుణాలు ఇప్పించాలని, గత ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల మంజూరు పథకాన్ని పునరుద్ధరించాలని వృత్తిదార్లు కోరుతున్నారు. దీంతోపాటు ఎక్కువ సేపు నిల్చోని పనిచేయాల్సి రావడంతో ఎక్కువ కాలం వృత్తిలో కొనసాగలేకపోతున్నామని, 50 ఏళ్ల దాటిని వృత్తిదార్లకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని కోరుతున్నారు.



పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల పై భారాలు వేయడం సరికాదని, పెంచిన సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఉండవల్లి లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ, శాఖాకార్యదర్శుల సమావేశానికి రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచము అని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన వాగ్దానాన్ని విస్మరించి, 15 వేల కోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలను వేయడం సరికాదన్నారు. తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని కట్టడి చేస్తామని వాగ్దానం చేసి నేడు వాడ వాడాలా బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్మకాలను పెంచి పేదల కుటుంబాలతో చెలగాటం ఆ డుతున్నారని అన్నారు. రోడ్లు విస్తరణ పేరుతో రాజధాని గ్రామాల్లోని వందలాది పేదల ఇల్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఎర్రబాలెంలో చిన్న పరిశ్రమలు కూడా రోడ్డు విస్తరణలో పోతున్నాయని, ఇల్లు తొలగించకుండా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని రామారావు కోరారు. కొండవీటి వాగు వెడల్పు పేరుతో ఉండవల్లిలోగృహాలు తొలగించేందుకు మార్కింగ్ చేశారని, దీంతో గృహ యజమానులు ఆందోళన చెందు తున్నారని అన్నారు. గ్రామసభలు జరిపి ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.మత విశ్వాసాలను, రాజకీయాన్ని దేనికి అది వేరు వేరుగా ఉంచాలని మతాన్ని రాజకీయాల్లోకి, పబ్లిక్‌లోకి తీసుకురాకూడదని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ఉద్దేశపూర్వకంగానే అమిత్ షా అవమాన పరిచే విధంగా మాట్లాడారని రాజ్యాంగ వ్యతిరేకి గా,వ్యవహరిస్తున్న హోంశాఖ మంత్రి అమిత్ షా మంత్రిగా కొనసాగే అర్హత కోల్పోయారని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టాక నిత్యవసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటూ తున్నాయని ధరలను నియంత్రించడంలో ఘోరంగా విఫలమయ్యారని అన్నారు.సోలార్ కుంభకోణంలో పీక ల లోతు కూరుకు పోయిన గౌతమ్ ఆదానిని కాపాడేందుకు బిజెపి పెద్దలు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. దేశ ప్రతిష్ట ను మంటగలిపిన ఆదానిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఆదానితో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసుకోవాలని కోరారు. రాజధానిలో నిర్మించిన టీట్కో గృహాలకు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించకపోవడంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, దీనితో మహిళలు భయాందోళన లకు గురవుతున్నారని వెంటనే రాజధానిలో నిర్మించిన టీట్కో గహాలకు ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాలని టీట్కో గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. రాజధాని రైతులు, అసైన్డ్ రైతులు పెండింగ్ కౌలు కొరకు ఎదురు చూస్తున్నారని, వెంటనే వారి కౌలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.రాజధాని పారిశుధ్య కార్మికులకు , అసెంబ్లీ, హైకోర్టులో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు, ఆశ , అంగన్వాడి వర్కర్లకు గత ప్రభుత్వం నిలిపివేసిన సామాజిక పెన్షన్ ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి బక్కి రెడ్డి, ఎస్ ఇమ్మానియేల్ రాజు పేరం బాబురావు, కుంభ ఆంజనేయులు, జి చెంచయ్య, ఎస్కే జానీ, గైరబోయిన నాగేశ్వరరావు, అత్తలూరి వీర వెంకయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాశం రామారావు


మాట్లాడు తున్న సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి మంగళగిరి

భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ కొరకు ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు అన్నారు. బుధవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భవన నిర్మాణ కార్మికులు జీవన పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అన్నారు. టిడిపి కూటమి నాయకులు ఎన్నికలకు ముందు భావన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరచాలని కోరారు. రానున్న కాలంలో ఈ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి షేక్ జానీ భాష, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, సిఐటియు నాయకులు టి శ్రీరాములు, సంఘం నాయకులు పి శంకర్రావు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యతో బాధపడుతున్నా... నష్ట పరిహారం ఇప్పించండి

ఆవేదన వ్యక్తం చేసిన ఎసిసి కార్మికుడు శివ

29వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత ఆరు మాసాలుగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నానని, ఎసిసి కార్మికుడు రాచ కొండ శివ బుధవారం ఎసిసి కార్మికుల దీక్ష వద్ద తన ఆవేదనతో కన్నీటి పర్వత మయ్యాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరాయి. ఈ దీక్షలను సిఐటియు తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు, ఎసిసి కార్మికుడు రాచకొండ శివ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎసిసి కార్మికుడు శివ మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేయడంతో ఆర్థికంగాను, ఆరోగ్యపరంగాను అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న తన కుటుంబానికి ఆరు నెలల నుండి కిడ్నీ వ్యాధికి చికిత్స చేయించుకోలేక నరకయాతన పడుతున్నానని విలపించాడు. దీక్షలో ఉన్న పలువురు కార్మికుల సైతం శివ ఆవేదనకు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇప్పటికైనా తనకు రావలసిన నష్టపరిహారాన్ని ఇప్పించాలని శివ వేడు కుంటున్నాడు. సిఐటియు తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ఎంతోమంది కార్మికులు కంపెనీ లాకౌట్ అనంతరం అనారోగ్య సమస్యలతోనూ, ఆర్థిక ఇబ్బందులతోనూ చనిపోయినా కానీ పాలక పక్షాలకు కనికరం లేదని ఆయన ఆవేదన చెందాడు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ జోక్యం చేసుకొని తాను ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం ఎసిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ దీక్షలలో ఎస్ కే భాష, దర్శి మాణిక్యాలరావు, సూర్య ప్రకాష్, సాంబశివరావు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ, అంకయ్య, రమాదేవి, శారమ్మ, శారద, దుర్గ భవాని, నాగేశ్వరరావు, సూర్య ప్రకాష్, దానయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.




క్యాలెండర్ ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ సంజనా సింహ

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తెనాలి డివిజన్ కమిటి ప్రచురించిన 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను తెనాలి సబ్ కలెక్టర్ వి సంజనాసింహ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగానికి ఉపయోగపడే విధంగా క్యాలెండర్‌ను ప్రచురించిన కమిటిని సబ్ కలెక్టర్ అభినందించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె బాబు ప్రసాద్ మాట్లాడుతూ పూర్వం గ్రామంలో కరణం, గ్రామ మోతుబరి దగ్గర క్యాలెండర్ ఉండేదని చెప్పారు. తిథి, వార, నక్షత్రాలతో పాటు వ్యవసాయ సంబంధమైన విషయాలు వారి ద్వారా తెలుసుకునే ఆనవాయితి ఉండేదన్నారు. ప్రస్తుతం రైతాంగానికి ఉపముక్తంగా ఉండేలా క్యాలెండర్ తీసుకురావడం అభినందనీయమని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరం రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ములక శివకుమారి, షేక్ హుస్సేన్ వలి, కెవి సత్యనారాయణ, ఎన్ రాజ్యలక్ష్మి, భీమవరపు చిన్నరామిరెడ్డి, మాగంటి ఎల్లమందయ్య, తాటి వెంకటేశ్వర్లు, అరికా ప్రసాద్, జి వెంకట సుబ్బయ్య, అనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాలలో బుధవారం నూతన సంవత్సర సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, సూపరింటెండట్ చంద్రమోహన్, ఈవోపీఆర్డీ జవహర్లాల్ నెహ్రూ, వివిధ గ్రామాల కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఐ.సునీత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపగా డిటి కనకదుర్గ ఆరే త్రివేణి వివిధ గ్రామాల వీఆర్వోలు, వివిధ శాఖల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దోస్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

సంస్కృతిని మర్చిపోకూడదు. విలువలతో కూడిన పూర్వ సాంప్రదాయాలు పిల్లలకు నేర్పాలని పలువురు తెలిపారు. గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని బుధవారం స్థానిక జంపాల వారి కాంప్లెక్స్‌లో కార్యక్రమా లకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వర్ణ వివక్ష లేకుండా కుల మతాలకు అతీతంగా అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామానికి చెందిన ఎన్నారై జంపాల సుబ్బారావు పద్మజ దంపతులు అమెరికా నుండి వచ్చి ప్రతి సంవత్సరం ఈ సంబరాల నిర్వహణలో పాలుపంచుకుంటారు. ఈ సంవత్సరం అధికార యంత్రంగంతో కలిసి ఎటువంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా ఉత్సాహంగా ఆనందంగా సంబరాలు జరుపుకుంటామన్నారు. జనవరి 12వ తేదీ విద్యార్థిని విద్యార్థులతో పాటు ఆటల పోటీలు చిత్రలేఖనం క్విజ్ వక్తృత్వం పోటీలు నిర్వహించనున్నారు. 13వ తేదీ భోగి మంటలు కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రెండు కిలోమీటర్లు నడక ర్యాలీ మహిళలకు ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించనున్నారు.. గెలుపొందిన వారికి బహుమతితో పాటు షీల్డ్ లను కూడా అందజేస్తారు. పత్రికా ముఖంగా అందరికీ ఆహ్వానిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐ సునీత ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ మెగావత్ ఖుషి బాయి ,గద్దె అనసూర్యవతి, దోస్త్ సభ్యులు గూడూరు వెంకటరావు ,గద్దె శ్రీనివాస్ , వల్లూరు నరసింహారావు , జంపాల నరేంద్ర పర్వతినేని హర్ష తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు దోస్త్ సభ్యులు

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సిఐటియు కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. సిఐటియు నాయకులు జెవి రాఘవులు, ఎం బాలాజీ, వివి జవహర్లాల్, టి శ్రీరాములు, పి రామచంద్రరావు లను మున్సిపల్ యూనియన్ నాయకులు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, యూనియన్ నాయకులు శివ, పి పూర్ణ, మంగయ్య, అంజిబాబు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో నేడు ఎంపి, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమాలకు ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు దావుపల్లి -ఎర్రగొండపాలెం హైవే రోడ్డుకు శంకుస్థాపన, 11.30 గంటలకు వజ్రాలపాడులో సిసి రోడ్డు ప్రారంభం, 12 గంటలకు హనుమాపురంలో సిసి రోడ్, 12.30 గంటలకు రామచంద్రపురం తండా సిసి రోడ్డు, ఒంటి గంటకు శిరిగిరిపాడు సిసి రోడ్డు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం శిరిగిరిపాడులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 2:30కు వెల్దుర్తిలో ఐటీడీఏ కార్యాలయ శంకుస్థాపన, అనంతరం ఉప్పలపాడు, మండాది గ్రామాల్లో సిసి రోడ్ల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.



వృద్ధులు, చిన్నారులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి- మాచర్ల

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక స్వామి వివేకానంద సేవాశ్రమంలో వృద్ధ చెంచు మహిళలకు, చిన్నారులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచర్ల మున్సిపల్ కమిషనర్ ధూళిపాల వేణుబాబు హాజరై సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డితో కలిసి 30 మంది చెంచు వృద్ధులకు, చిన్నారులకు రగ్గులు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చలి తీవ్రతను గుర్తించి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి దాతలు ఆర్టీసీ గుంజ చెన్నయ్య, భార్య కల్పన, వారి కుమారులు యశ్వంత్, అఖిల్ సహాయంతో రగ్గులు సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లావెంకటేశ్వరరావు, లాయర్ బివియన్‌రెడ్డి, రామయ్య, నిఖిల్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

గతేడాది పరిణామాలపై 3న విశ్లేషణ సభ

ప్రజాశక్తి - గుంటూరు

అవగాహన సంస్థ గత 25 ఏళ్ల నుండి నుండి ప్రతి సంవత్సరం మొదట్లో నిర్వహిస్తున్న జాతీయ, అంతర్జాతీయ రాజకీయ విశ్లేషణ సభను శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అంరండల్‌పేట 15/1లోని కుబేరా టవర్స్ అవగాహన కార్యాలయంలో నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి తెలిపారు. విశ్లేషణ సభలో ప్రధాన విశ్లేషకులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడతారని, విశ్లేషకులు బి.మల్లికార్జునరావు, అవధానుల హరి పాల్గొని రాజకీయాలు విశ్లేషిస్తారని పేర్కొన్నారు.



వినుకొండ



మాచర్ల

నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - వినుకొండ

కొత్త సంవత్సరంలో రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ మేలు జరగాలి, ఆ మంచిని పదిమందితో పంచుకోవాలన్నదే తన ఏకైక ఆకాంక్షని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పట్టాలెక్కిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఈ ఏడాది మొత్తం సానుకూల వాతవరణంలోనే సాగతుందని బలంగా నమ్ముతున్నానన్నారు. టిడిపి ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించగా కేక్‌ను జీవీ ఆంజనేయులు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నాగశ్రీను రాయల్, నిశ్శంకర శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి దంపతులు, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, పట్టణ, రూరల్ సిఐలు శరత్‌బాబు, ప్రభాకర్, తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి- మాచర్ల

కష్ట కాలంలో పార్టీకి అండగా నిలిచి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకూ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని వివిఎన్ గార్డెన్స్ నందు నూతన సంవత్సర వేడుకలు టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలేఅయినా నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులు చేసుకున్నామని, చేసుకోవాల్సినవి ఇంకా ఉన్నాయని అన్నారు. కార్యకర్తల అంచనాలు చాలా ఉన్నాయని, వాటికి అనుగుణంగా అవకాశాలు రావడం లేదని, అవకాశాలు వచ్చినప్పుడు తాను వారికి సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. తొలుత



సత్తెనపల్లి



మాచర్ల



నాదెండ్ల మండలం చందవరంలో..

శ్రీశైలం రోడ్డులో గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి మాచర్ల పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఆయనకు సంఘ పెద్దలు స్వాగతం పలికారు. రాష్ట్రంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి అన్నదాత సిరులు కురవాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. అనంతరం కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలూరి నరసింహారావు, ఎనుముల కేశవరెడ్డి, కొమ్మెర దుర్గారావు, జూలకంటి అక్కిరెడ్డి, పేరువాళ్ళ పుల్లారావు, మాచర్ల వాసు, సుందర్‌రావు, నర్రా గురువారెడ్డి, మాచర్ల బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నూతన సంవత్సరంలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి ప్రజా వేదికలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు శుభాకాంక్షలు చెప్పారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు దుప్పట్లు అందించారు. రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హోలీ ఫ్యామిలీ, సీయోను లూథరన్, తెలుగు బాప్టిస్ట్ చర్చీలతోపాటు ఇతర ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలతోపాటు కేక్‌లు కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును టిడిపి శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి ఫలాలను పొంది ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో పయనించాలన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

నూతన సంవత్సర సందర్భంగా బుధవారం మండలంలోని చందవరంలో 2000 మందికి అన్నదానం చేయగా ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు బండారుపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. యన్నం వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. తోటటి బోలయ్యను సత్కరించారు. నల్లమోతు హరిబాబు, పుల్లారెడ్డి, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుటిఎఫ్ 2025 క్యాలెండర్‌ను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ నరసరావుపేటలోని తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగం బలోపేతానికి యుటిఎఫ్ కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రేమ్‌కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు, గౌరవాధ్యక్షులు ఖాసీంపీరా, జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, కె.తిరుపతి స్వామి, జమాల్, ఉషా శౌరిరాణి, కౌన్సిలర్లు ఎన్.సుందరరావు, హెచ్ఎంలు ఒ.సాంబయ్య, నరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, ఒ.కోటేశ్వరావు, అఖిబ్ పాషా, కె.రవి, జాన్, పి.సత్యానందరావు, కెవి నాగయ్య, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండలం విద్యాశాఖ అధికారి బి.మల్లికార్జునశర్మ స్థానిక ఎంఆర్‌సిలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లయిన సందర్భంగా స్వర్ణోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులందరికీ కొత్త సంవత్సరం అంతా మంచి జరగాలని, ప్రభుత్వ పాఠశాలలోల విద్యార్థుల సంఖ్య పెరగడానికి



ఉపాధ్యాయులు ఇప్పటి నుండే ప్రణాళిక రచించుకొని కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, అధ్యక్షులు కె.గణేష్ కుమారి, సహాధ్యక్షులు కొలసాని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.ఫణికుమార్‌బాబు, ఆర్థిక కార్యదర్శి ఎస్.బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు రాయ మల్లికార్జునరెడ్డి, పీటా నేతాజీ, కె.కిషోర్, బి.శ్రీనివాసరావు, నూరుల్లా, వి.పద్మావతి, ఓ.బాలనాగేంద్రం, వై.వెంకటేశ్వరరావు, మాలిక్ పాల్గొన్నారు.

పాలకుల విధానాలతో మారని చేనేతల బతుకులు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి – మంగళగిరి

చేనేత రంగానికి సంబంధించి దేశంలోనే చేనేత వృత్తిదారులు ఎదురీదుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. బుధవారం మంగళగిరి చేనేతకార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో చేనేత రంగ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. చేనేత కార్మికులు అనేక ఇబ్బందులను కష్టాలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా చేనేత వృత్తులు కాపాడడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని రామకృష్ణ అన్నారు. చేనేత వృత్తులను కాపాడుకోవడానికి చ అందరూ సమయత్వం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. చేనేతలు వారికి రావాల్సిన పథకాలను పునరుద్ధరించాలని చేనేత సంఘాలకు ఎన్నికలు జరిపించాలన్నారు. ఆయన అన్నారు. దేశంలోనే వ్యవసాయ తర్వాత రెండవ అతిపెద్ద వృత్తి చేనేత అని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేతలకు అండగా నిలబడాలని తరత రాలుగా చేనేతలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. . ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన అన్నారు. ఎన్నోసార్లు చేనేత మంత్రి సవితాని కలిసి విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించడంలో మంత్రి విఫలమయ్యారని నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగూడె మాధవస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నతుల వరప్రసాద్ (మణి) ఆన్సర్ పవన్, చేనేతల శ్రేయోభిలాషి సాయి ప్రవీణ్ జువెలర్స్ అధినేత తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి బత్తూరిమోహన్రావు, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ,సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వర రావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణ మంగళగిరి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు బత్తుల గిరి దొడ్డి ఈశ్వరరావు సంఘం నాయకులు గంజి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



కుంచనపల్లిలో కేక్ కట్ చేస్తున్న అమర సుబ్బారావు తదితరులు

టిడిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి టిడిపి మండల పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, తాడేపల్లి మండలంలోని ప్రజలకు సుబ్బారావు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరా సుబ్బారావు మాట్లాడుతూ కూటమి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలోకి వెళ్తుందని ఆశిస్తున్నామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ ప్రజా దర్బార్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల టీడీపి ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగు మహిళ అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, కుంచనపల్లి, చిర్రా వూరు, ప్రాతూరు గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వ రరావు, కాసరగడ్డ శ్రీనివాసరావు, అరవపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో కేక్ కట్ చేస్తున్న వల్లభనేని వెంకట్రావు తదితరులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి పట్టణ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకల్ని టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా నూతన సంవత్సర కేక్ ను కట్ చేసి, పట్టణ పరిధిలోని అన్ని వార్డు లోని నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని, ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం టిడిపి కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ ను టిడిపి నాయకులు కట్ చేసి, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు, షేక్ నాగూర్ వలి, మద్దినేని సుబ్రహ్మణ్యం, కత్తిక శ్రీరాములు, జోరుగా దాసు, షేక్ నాగూర్, ఇమాంస, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న ఈపూరి బాబు తదితరులు



సబ్ ట్రెజరీ అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పెన్షనర్స్

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి – మంగళగిరి

మంగళగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంలో బుధవారం సబ్ ట్రెజరీ అధికారులు ఏ శ్యాంబాబు, బి శేషసాయిలను ఏపీ పెన్షనర్ అసోసియేషన్, మంగళగిరి శాఖ నాయకులు కలసి పుష్పగుచ్చాలు అందజేసి నూతన ఆంగ్ల సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీవో శ్యామ్ బాబు మాట్లాడుతూ నేటి నుంచి పెన్షనర్స్ నుండి లైఫ్ సర్టిఫికెట్స్ తీసుకోవడం జరుగుతుందన్నారు. పెన్షనర్స్ జీవన ప్రమాణ యాప్ ద్వారా ట్రెజరీలో నమోదు చేసుకోవా లన్నారు. అసోసియేషన్ నాయకులు కూడా పెన్షనర్స్ కు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బీ గోపిరెడ్డి, పీ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బాపనపల్లి వీరాంజ నేయులు, కోశాధికారి పీ కుమారస్వామి, అసోసి యేషన్ ప్రతినిధులు అందే కనకలింగేశ్వరరావు, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేటెడ్ అధ్యక్షులు బాపనపల్లి వీరాంజనేయులు నూతన సంవత్సరం సందర్భంగా పెన్షనర్స్ కు స్వీట్స్, పెన్నులు పంపిణీ చేశారు.



పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి – చేబ్రోలు

హరితరాయబారులకు, పంచాయతీ టెండర్ సిబ్బందికి నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం వేజెండ్లలో సర్పంచ్ జువ్వా హైమావతి, పంచాయతీ కార్యదర్శి ఎస్ వేణుగోపాలరావు నూతన వస్త్రాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామ ప్రజల పరిశుభ్రత , ఆరోగ్యం కోసం , పంచాయతీ తరపున ముందు వరుసలో ఉండి కార్మికులు పనిచేస్తారని, వారిని గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



గుండి మెడలో జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న చొప్పర బుల్లిబాబు

లయ రియల్ ఎస్టేట్ అధినేత వితరణ

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని గుండి మెడ గ్రామానికి చెందిన ప్రసన్న లయ రియల్ ఎస్టేట్స్ అధినేత చొప్పర బుల్లిబాబు గ్రామంలోని అన్ని ప్రార్థన మందిరాలకు, చర్చిలకు మంగళవారం రాత్రి న్యూ ఇయర్ సందర్భంగా కేక్ లను, జ్యూట్ బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ పాస్టర్లు, సేవకులు బుల్లి బాబుకు ఆశీర్వాదం పలికారు.

వికాస ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ సంఘం వికాస ఆధ్వర్యంలో క్యాలెండర్ ను బుధవారం ఇంచార్జ్ విసి ఆచార్య కే గంగాధరరావు ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కె. రత్నశీలమణి, ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ వర్సిటీలో అధ్యాపకులు ఉద్యోగులు పరిశోధకులు విద్యార్థులు ఒక కుటుంబంలో ఉంటూ వర్సిటీ అభివృద్ధికి బాటలు వేయటం ఆనందంగా ఉందన్నారు. స్నేహపూర్వకంగా సోదర భావంతో ఒకరికొకరు తోడ్పాటు అందించుకుంటూ వర్సిటీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై పొందన్నారు



ఈ సందర్భంగా అందరికీ నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస అధ్యక్షుడు నేలకు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డి. ప్రకాష్ బాబు, సంయుక్త కార్యదర్శులు నేలపాటి నాగేశ్వరరావు, వెంకటేష్, కోశాధికారి కే. యేసయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సిఎస్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి – తుళ్లూరు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా బాధ్యతలు స్వీకరించిన కె విజయానంద్ కు పలువురు అభినందించారు. తెలిపారు.అమరావతి దళిత చైతన్య వేదిక, మల్కాపురం గ్రామ టిడిపి మహిళా విభాగం నాయకురాలు కూచిపూడి మరియమ్మ బుధవారం సచివాలయంలో సి ఎస్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలతో పాటు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.



భారీ కేక్ కత్తిరిస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు దంపతులు

శ్రామిక వర్గం లేకుంటే అభివృద్ధిలేదు

కాటూరి వెంకటేశ్వరరావుకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి–తెనాలిరూరల్

కాటూరి శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వ రరావు, కొండమ్మ దంపతులను శిల్పాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక వహాబ్ రోడ్డులో కాటూరి శిల్పశాల వద్ద బుధవారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో సంస్థలో పని చేస్తున్న కార్మికులతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాటూరి దంపతులను భారీ గజమాలతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. తెనాలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కాటూరి వెంకటేశ్వరరావు అభినందనీయులని కాటూరి శిల్పసాల సూపర్వైజర్ కరీముల్లా అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో త్రీ డి ప్రతిమలను తయారుచేయడంలో కాటూరి కుమారులు రవిచంద్ర, శ్రీ హర్ష సిద్ధహస్తులన్నారు. పనిలో మెళుకువలను సులభంగా నేర్పించే గురువులు వెంకటేశ్వరరావును సత్కరించుకోవడం తమ బాధ్యత అన్నారు. ప్రతీ ఏటా జనవరి ఒకటిన తమ కుటుంబ సభ్యులతో కాటూరి పండగగా జరుపుకుంటామని తెలిపారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రామికవర్గం లేకపోతే కాటూరి సంస్థ దినదినాఅభివృద్ధి చెందేది కాథని అన్నారు. ఇనుప వస్తువులతో వివిధ శిల్పాలను, ఆకతులను మలచి, ముఖ్యంగా కాటూరి ఆర్ట్ గ్యాలరి ద్వారా భారీ స్థాయిలో అంబేద్కర్ విగ్రహాల ప్రదర్శనను ఏర్పాటుచేసి అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్, తెనాలి బుక్ ఆఫ్ రికార్డ్ సాధించినందుకు గర్వంగా ఉందన్నారు. కార్మికుల సహకారంతో ఇంతటి విజయాన్ని సంపాదించామన డంలో అతిశయోక్తి లేదన్నారు. తన విజయం వెనుక తన భార్య కొండమ్మ, కుమారులు కాటూరి రవిచంద్ర, కాటూరి శ్రీహర్ష ఉన్నారన్నారు. కార్యక్రమంలో శ్రీను, కృష్ణ రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.



మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – చేబ్రోలు

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి జనసేన పార్టీ ఆఫీసులో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో చేసే సేవా కార్యక్రమాలు విజయవంతం అవ్వాలని కోరారు. పొన్నూరు శాసనసభ్యులు సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ని చింతలపూడి స్వగహం దగ్గర కలిసి బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కొంతమంది ప్రభుత్వ అధికారులను కలిసి క్యాలెండర్ ను అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్, ట్రెజరీ చిలకపాటి సింహాద్రి ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నూతన సంవత్సరం సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడ్ని కలిశారు. పెమ్మసాని సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నూతన సంవత్సరంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమరావతి, రాష్ట్ర అభివద్ధిని కూటమి ప్రభుత్వం సాధించి తీరుతుందని ఈ సందర్భంగా పెమ్మసాని తెలియజేశారు. సిఎంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్.మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

సిఎంను కలిసిన ఐజి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉండవల్లిలో సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతంగా పనిచేస్తున్నందుకు ఐజిని సిఎం అభినందించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

సుమేధా హైస్కూల్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్ ఆవరణలో బుధవారం స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా సాగే మానవ జీవన ప్రయాణంలో మర్చిపోకుండా తేదీలను సంఘటనను చరిత్రను గుర్తు చేసేది క్యాలెండర్ అని, భవిష్యత్తులో చేయాల్సిన పనులను కూడా క్యాలెండర్ సూచిస్తుందన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ప్రిన్సిపాల్ రాంబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు



మాట్లాడుతున్న మున్ను

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడి గుంటలోని జైన్ హైస్కూల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ మున్ను కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణ లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నసీర్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు



వైసిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సరం సందర్భంగా గుంటూరులోని పలు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నేతలకు పూల బొకేలు, డెయిరీలు,శాలువలను బహూకరించారు. అలాగే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈసందర్భంగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త రామచంద్ర రావును పెమ్మసానికి మెమెంటో అందచేశారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ కూడా పెమ్మసానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పికి పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ కార్యాలయంలో నగర ప్రముఖులు,పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్లరామాంజనేయులు, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కార్యాలయాల్లో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించారు.నగర పాలక సంస్థ లో మేయర్ కావటి మనోహర్ నాయుడికి అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులుకు కూడా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి.

జిల్లాలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కలెక్టర్‌కు పలువురు అధికారుల శుభాకాంక్షలు



ప్రజాశక్తి-గుంటూరు

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి పలువురు జిల్లా అధికారులు పూలబొకేలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, డిఆర్‌ఒ షేక్.ఖజావలి, ఆర్‌డిఒ కే.శ్రీనివాసరావు, ఎంటిఎంసి కమిషనర్ అలీంబాషా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి , డిఎస్ఒ కోమలి పద్మ, డిఈఒ శైలజ , ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

షెల్టర్ హోంలో దుప్పట్లు, బిస్కెట్లు పంచిన కలెక్టర్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక పట్టాభిపురంలోని మాతశ్రీ పిల్లల షెల్టర్‌హోమ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజతో కలసి సందర్శించారు. షెల్టర్ హోమ్‌లోని పిల్లలకు దుప్పట్లు, బిస్కెట్లు, స్వీట్లు, పండ్లు, పెన్సిల్, పెన్‌కిట్లను పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థితికి రావాలని హితవు పలికారు. అనంతరం అనురాగ్ ఓల్డేజ్ హోమ్ అండ్ కేర్ సెంటర్‌లోని వద్ధులను కలసి పరామర్శించి వారికి దుప్పట్లు, దుస్తులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ షేక్.ఖాజావలి, ఆర్డిఒ కే.శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాల తహశీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక 41వ డివిజన్, పుచ్చపల్లి సుందరయ్య నగర్‌లోని నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్‌లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి నిర్వాహకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆది నికల్సన్, ఎల్.ఎస్.భారవి, ట్యూషన్ టీచర్ కె.సుజాత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

తులసి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



రామచంద్ర ప్రభుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వ్యాపారవేత్తలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని తులసి గ్రూప్ సంస్థ కార్యాలయంలో బుధవారం 2025 నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్రప్రభు, తులసి యోగిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రప్రభు, యోగిష్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రైతుసోదరులు, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడి పంటలు సమద్ధిగా ఉండాలని, నూతన సంవత్సరం అందరికీ సరికొత్త భవిష్యత్‌ని అందించాలని ఆకాంక్షించారు. జిడుగు సుబ్బారావు ఆధ్వర్యంలో కర్ర సాము విన్యాసాలు చేసిన విద్యార్థులను ప్రభు అభినందించారు. కార్యక్రమంలో ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, ప్రముఖ వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, కార్పొరేటర్ దాసరిలక్ష్మి దుర్గ, వాసు, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వీసీ, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా, విజ్ఞాన్ ఫార్మసీ, విజ్ఞాన్స్ జూనియర్ కాలేజీలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఘనంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు మాత్రమే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు.యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యావిధానం ఉండాలన్నారు. కార్పొరేట్ ప్రపంచంలో యువతకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని సాధించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌కట్ చేశారు. వేడుకల్లో వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పి.ఎం.వి.రావు, మాజీ డీజీపీ, విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

6న చలపతి ఫార్మసీలో మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలతోని ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మకాలజీ విభాగం సంయుక్తంగా జనవరి 6వ తేదీన 'మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ అండ్ డ్రగ్ డెవలప్మెంట్' అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు.బుధవారం విట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.శ్రీనివాసరెడ్డి హాజరై వర్క్‌షాప్‌కు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మిషిన్ లెర్నింగ్ ఫార్మసీ, డ్రగ్ డెవలప్‌మెంట్ రంగాలలో విప్లవాత్మకమైన మార్పులను తెస్తుంది. దీని ద్వారా ఔషధ అభివద్ధి, సమయాన్ని తగ్గించడం, ఖర్చుతగ్గించడం, రోగుల వ్యక్తిగత అవసరాలను తీర్చడం వంటి అంశాలలో ప్రధాన పాత్ర పోషిస్తోందని అన్నారు.అలాగే క్లినికల్ ట్రయల్స్, ఫార్మకో విజిలెన్స్, డేటా అనలిటిక్స్ వంటి విభాగాలలో మిషిన్‌లెర్నింగ్ ఉపయోగాలు పరిశ్రమను మరింత సమర్థవంతం చేస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌కు ఫార్మసీ విద్యార్థులందరూ అర్హులని, పాల్గొనదలచిన వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు